# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఐఎన్ఎస్ "తారాగిరి" నౌకను విశాఖపట్నంలో జాతికి అంకితం చేసిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్.**

2. **పార్లమెంటులో ఆమోదం ద్వారా రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించినట్లయిందని పేర్కొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

3. **వ్యర్థాల పునర్వినియోగంలో స్వచ్ఛ రథాలు కీలకంగా పనిచేస్తున్నాయన్న ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్.**

4. **శనగ పంట రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించిన మంత్రి కె అచ్చెన్నాయుడు .**

5. **రాష్ట్రంలో జరిగిన రెండు వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఐదుగురు మృతి.**

==========================

కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈ రోజు విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా నేవల్డాక్ యార్డ్ వేదికగా ఐఎన్ఎస్ "తారాగిరి" నౌకజల ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని జాతికి అంకితం చేశారు. అనంతరం రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సముద్ర భద్రతకు కేంద్రప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఆధునిక సాంకేతికత పరిజ్ఞానంతో నౌక దళాన్ని బలోపేతం చేస్తున్నామని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

..వాయిస్..30..

ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి, వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాలతో పాటు ఇతర నౌక దళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

--------------------------

పార్లమెంటులో ఆమోదం పొందడం ద్వారా రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించినట్లయిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో అమరావతి అంశంపై ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాజ్యసభ, లోక్‌సభలోనూ

బిల్లు ఆమోదానికి మద్దతు తెలిపిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి ఉంటుందని ముఖ్యమంత్రి తెలుపుతూ...

వాయిస్...27 సెకన్లు

---

రాష్ట్ర వ్యాప్తంగా వ్యర్థాలను సేకరించి, వాటిని పునర్వినియోగం చేయడంలో స్వచ్ఛ రథాలు విజయవంతంగా పనిచేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా ఆయన ఈ రోజు స్పందిస్తూ, కాలుష్యాన్ని నియంత్రిస్తూ పర్యావరణ పరిరక్షణ సాధించాలనే లక్ష్యంతో, స్వచ్ఛ రథాలు కార్యక్రమం ప్రారంభమైందని తెలిపారు. చెత్త నుంచి సంపద సృష్టి కార్యక్రమంలో భాగంగా, ఒక్క రోజులోనే దాదాపు లక్ష కేజీల వ్యర్ధాలను స్వచ్ఛ సారథులు సేకరించారని ఈ వ్యర్థాల ద్వారా సుమారు 12 లక్షల రూపాయల హస్త్రఅ ఆదాయం లభించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 537 పాఠశాలల పరిధిలో, మొత్తం 576 స్వచ్ఛ రథాలు పాల్గొన్నాయని తెలిపారు.

---

ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ ఒడిసాలోని ఖుర్దా డివిజన్ పరిధిలోని 7 రైల్వే స్టేషన్లను విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కు బదిలీ చేస్తూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసిందని పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఈ మేరకు ఒక వీడియో సందేశంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నుండి పలాస వరకు ఉన్న రైల్వే స్టేషన్లను కూడా విశాఖ రైల్వే జోన్ లో చేర్చాలని పలుమార్లు రైల్వే మంత్రిని కలసి కోరామని తెలిపారు. ఈ నిర్ణయం ఉత్తరాంధ్రలో రైల్వేల అభివృద్ధికి ఉపయోగపడుతుందని కేంద్రమంత్రి తెలుపుతూ,

వాయిస్..25.. సెకన్లు

---

రాష్ట్రంలో శనగ పంట ఉత్పత్తి పెరగడంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటున్నదని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది శనగ ఉత్పత్తి కూడా 4 లక్షల మెట్రిక్ టన్నులకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారని ప్రస్తుతం రాష్ట్రానికి 94 వేల 5 వందల మెట్రిక్ టన్నుల శనగ కొనుగోలు లక్ష్యంగా ఉన్నప్పటికీ, పెరిగిన ఉత్పత్తి దృష్ట్యా దానిని పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. ఈ మేరకు రైతులు నష్టపోకుండా ఉండేందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశామని మంత్రి వివరించారు.

---

హెచ్ఐవీ కేసుల నియంత్రణ, బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ – ఏపీశాక్స్ ఉత్తమ పనితీరు కనబరిచి, దేశంలో మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు దేశంలోని ఎయిడ్స్ నియంత్రణ సంస్థల పనితీరును జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పరిశీలించగా... మొత్తం నిర్దేశిత సూచికల్లో 107 స్కోరు సాధించి, తొలిస్థానంలో నిలిచిందని తెలిపారు. కేంద్ర, జిల్లా, ఉప

కారాగారాల్లో ఖైదీలకు హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంలో ముందంజలో ఉందని, అనాథ ఆశ్రమాలు, అక్రమ రవాణాకు గురైన మహిళలు, బాలల సంరక్షణ గృహాల్లో ఉండే వారికి క్రమం తప్పకుండా హెచ్ ఐవీ నిర్ధారణ పరీక్షలను ఏపీ శాక్స్ నిర్వహిస్తోందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఈరోజు జరిగిన రెండు వేర్వేరు రహదారి ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం కూడలి వద్ద జాతీయ రహదారిపై బైక్ ను విజయవాడ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఢీకొన్నదని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు యువకులు మృతి చెందారని ఎలమంచిలి సీఐ ధనుంజయరావు తెలిపారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం లక్ష్మీపురం జాతీయ రహదారిపై ఈ తెల్లవారుజామున బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని అనంతపురం శాసనసభ్యులు దగ్గుబాటి వేంకటేశ్వర ప్రసాద్ అన్నారు. అనంతపురంలో టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి –సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన ఈ రోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ, అనంతపురం నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు 550 మందికి 5.50 కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సహాయం అందించామని తెలుపుతూ,

వాయిస్..20.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని బాల సదనాలు, శిశుగృహాలు, బాలల సంరక్షణ కేంద్రాలకు వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాలో జాప్యం లేకుండా చూడాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ వి.సూర్యనారాయణరాజు కోరారు. జిల్లాల కలెక్టర్లు వారి పరిధిలోని సంబంధిత సంస్థలను గుర్తించి క్రమం తప్పకుండా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో సూచించారు. వంట గ్యాస్ సరఫరాలో అంతరాయం కారణంగా పిల్లలకు సమయానికి భోజనం అందించడంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 108 అత్యవసర సేవలు గత మూడు నెలల కాలంలో 9 వేల 183 మంది బాధితులను విజయవంతంగా ఆసుపత్రులకు చేర్చిందని 108 సేవల విభాగం ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించింది. 108 అంబులెన్స్ సేవలు కేవలం రవాణా వ్యవస్థగా కాకుండా, అత్యవసర వైద్య సేవల మొబైల్ విస్తరణగా పనిచేస్తూ, ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపింది. అత్యాధునిక వైద్య పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది, సమర్థవంతమైన కాల్ సెంటర్ వ్యవస్థల సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి, సమీప ప్రాంతాల ఆసుపత్రులకు సురక్షితంగా తరలిస్తున్నామని తెలిపింది.

======================